క్లుప్తంగా

ఘనంగా సామూహిక సరస్వతీ పూజ



సరస్వతీ పూజలో పాల్గొన్న పిల్లలు, తల్లిదండ్రులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్ సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం రాత్రి సామూహిక సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ 19వ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకుడు వి.వి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన సరస్వతీ పూజలో పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 10న భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బల్లల పండగ



మాట్లాడుతున్న జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము

అగనంపూడి: రజకుల సాంప్రదాయమైన బల్లల పండగను 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరాధ్య దైవం వడివేలు మాచిదేవ వీరభద్రస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము మాట్లాడుతూ రజక సామాజిక వర్గాన్ని ఆదుకోడానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. నగర పరిధిలో నీటి వనరులు ఉన్న చోట దోబీఖానాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన పనిముట్లు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోనేటి రవి, గోవిందరావు, పొట్లాడ సత్యనారాయణ, ఈశ్వరరావు, రాజు, కాళిదాస్, రజక సంఘ నాయకులు, సంఘ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు వసతులు కల్పించాలి



వసతులు కల్పించాలని నినాదాలు చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు, సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోట, బీసీ రోడ్డులోని టిడ్కో గృహ సముదాయాలకు వసతులు కల్పించాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక టిడ్కో సముదాయాల వద్ద లబ్ధిదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస సదుపాయాల కోసం రెండు నెలల నుంచి ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి పెదగంట్యాడ దాసరిపేటలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ముగ్గురిని దువ్వాడ పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 77వ వార్డు పరిధి దాసరిపేటలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దువ్వాడ పోలీసులు దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 23వేల నగదు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ దినోత్సవం

విశాఖ విద్య: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి వేడుకలను సోమవారం గోపాలపట్నం బాలుర హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి కె. ప్రసాద్ తెలిపారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ అంశాలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఇప్పటికే మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయటం జరిగిందన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టిస్ట్‌గా.. చిత్రకారుడిగా, దర్శకుడిగా రాణింపు

గాజువాకకు చెందిన బంగార్రాజు ప్రతిభ

కళాకౌముది సంస్థ ద్వారా కళారంగానికి జీవం

ఆసక్తి.. పట్టుదల ఉంటే రాణించడానికి వయసుతో సంబంధం లేదని నిరూపిస్తున్నాడు ఆ కళాకారుడు.. ఇంజినీర్‌గా స్థిరపడినా బాల్యం నుంచి మక్కువ ఉన్న కళారంగాన్ని వదలలేదు. సుమారు 78 ఏళ్లు దాటినా భిన్న రంగాల్లో ఆయన రాణిస్తూనే వస్తున్నారు. ఒక వైపు నాటకాలు రాస్తూ.. ఇంకోవైపు రచనలు చేస్తున్నారు.. అంతేనా దర్శకత్వం చేస్తూ కళలకు జీవం పోస్తున్నారు కొత్తపల్లి బంగార్రాజు.

-కూర్మన్నపాలెం

బంగార్రాజు.. మల్టీ టాలెంటెడ్



బహుముఖ ప్రజ్ఞాశాలి



అందుకున్న షీల్డులు

అలాగే రారాజు,తీరనిబంధం, శిరీషిక వంటి నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారు. అంతే కాకుండా చిత్రకారుడిగా నీటి రంగులతో చిత్రాలు గీయటమే కాక తైలవర్ణ చిత్రాలు కూడా నేర్చుకొన్నారు. నాటికల ప్రచారానికి చిత్రకళ బాగా దోహదం చేస్తుందని భావించి అందుకోసం విశేష కృషి చేశారు. వీటి అన్నిటితో పాటు విశాఖ ఆకాశవాణి కేంద్రంలో శతాధిక ప్రసంగాలు చేసి రికార్డులకు ఎక్కారు. అలాగే కొన్ని టీవీ సీరియల్స్‌లో కూడా నటించి పలువురి మెప్పుపొందారు. ఇంతటితో ఆగిపోకుండా వివిధ ప్రాంతాల్లో నిర్వహించే నాటిక, చిత్రకళా పోటీలకు కూడా హాజరై న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. గమరార్థం సహస్రాధిక ప్రసంగ కర్తగా దాదాపు 1500 సభలు నిర్వహించి దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. అలాగే శతాధిక వ్యాసాలు రాసి తనదైన శైలిలో కళారంగం విస్తృతికి కృషి చేసిన మహానుభావుడిగా బంగార్రాజు కీర్తి సంపాదించారు.

కళకు జీవం

ప్రపూర్ణ కళానిధి, లలితకళా వాస్పతి, ప్రయోగాత్మక నాటక చక్రవర్తిగా ప్రసిద్ధికెక్కిన బంగార్రాజు కళా కౌముది అనే సంస్థను స్థాపించారు. ఆ సంస్థ ద్వారా అనేక నాటకాలు,నాటికలు ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు ఆయనే స్వయంగా దర్శకత్వం వహించి పలువురి అభిమానాన్ని చూరగొన్నారు. జాతీయ జ్యోతి, ఆపదమొక్కులు, యుగసంధ్య, ఆరాధన వంటి నాటికల్లో నటించి ప్రశంసలు అందుకున్నారు.

చిన్నతనం నుంచి నాటికలపై ఆసక్తి

చిన్నతనం నుంచే నాటికలు, నాటకాలపై ఉన్న అభిమానం అతన్ని అత్యున్నత స్థానంలో నిలబెట్టింది. అభిరుచికి అతడి ప్రతిభ తోడవంతో అవార్డులు.. బహుమతుల పంటపండింది. నూతన ఒరవడితో ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకోవడంతో ఎంతోమంది మన్ననలు అందుకున్నారు. అంతే కాకుండా ఎన్నో బహుమతులు, బిరుదులు సొంతం చేసుకొని ముందుకు సాగుతున్నారు కొత్తపల్లి బంగార్రాజు. వృత్తి రీత్యా మెకానికల్ ఇంజినీర్ అయినప్పటికీ ఆయన రచనలు, కళారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి కళాభిమానుల మనస్సులను దోచుకుంటున్నారు.

ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యం

ప్రజల్లో భావ చైతన్యం తీసుకురావడానికి జీవితాంతం కృషి చేస్తాను. దానికి కోసం 1996లో స్థాపించిన కళాకౌముది ద్వారా నేటికీ అన్ని రంగాల్లో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను. ప్రభుత్వాలు కూడా కళారంగానికి ప్రోత్సాహం ఇవ్వాలి. నాటికలు, నాటికల ద్వారా సమాజంలో చైతన్యంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించవచ్చు.

– కొత్తపల్లి బంగార్రాజు, సమతానగర్ వుడాకాలనీ,

పశ్చిమ గోదావరిలో పుట్టి.. వృత్తి కోసం విశాఖ వచ్చి...

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో జన్మించిన బంగార్రాజు ఇంజనీరింగ్ పూర్తి చేశారు. బీహెచ్‌పీవీలో ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందారు.ఉద్యోగానికి రిటైర్ అయినా కళారంగంపై ఉన్న మక్కువ మాత్రం ఆయన్ను నడిపిస్తోంది.దీంతో అనేక బిరుదులు కూడా దక్కించుకున్నారు.



బంగార్రాజుకు లభించిన అవార్డులు, ప్రశంసా పత్రాలు



ధర్మవరపు సుబ్రమణ్యం నుంచి అభినందనలు పొందుతున్న రాజు(ఫైల్)

9న బౌద్ధ సమ్మేళనం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కమిటీ నాయకులు

పెదగంట్యాడ: ఈ నెల 9న అనకాపల్లిలోని బొజ్జన్నకొండ వద్ద నిర్వహించనున్న బౌద్ధ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ కోరారు. పెదగంట్యాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో పాటు బర్మా, కంబోడియా నుంచి బౌద్ధ బిక్షువులు పాల్గొంటారని తెలిపారు. ఇందులో భాగంగా ఆ రోజు దమ్మ జ్యోతి, ర్యాలీ, మహాసభ, బౌద్ధ సాంస్కృతిక సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో టేకేటి పెంటయ్య, గంట్యాడ గురుమూర్తి, అనపర్తి వెంకటరమణ, కోరమాటి అన్నవరం, ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మ రక్షణ



బెల్ట్ గ్రేడింగ్ పోటీల విజేతలతో అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: కుడో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజేతలకు ఆదివారం బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ కుడో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ త్రిష్నా మైదానంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 40 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎ. కిరణ్‌కుమార్, స్టీల్ ప్లాంట్ గుర్తింపు సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, గోల్డెన్ బ్లూ బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎ. శశిధర్, కోశాధికారి ఎ. అనూరాధ, ఎగ్జామినర్ ఎం. తులసీరావు, కోచ్ బి. యశ్వంత్‌తో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరలో గృహ నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ ఉపాధ్యక్షుడు వెంకటరావు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశాన్ని ఆదివారం భెల్ టౌన్ షిప్‌లోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. సీనియర్ సబ్ కమిటీ మెంబర్లు, సొసైటీ మెంబర్లు 250 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు వెంకటరావు మాట్లాడుతూ త్వరలో గృహ నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అజెండాలో పొందుపర్చిన పాయింట్లను మెంబర్లకు సొసైటీ సభ్యులు చదివి వినిపించారు. సొసైటీ పాలకవర్గం ఇప్పటి వరకు చేసిన పనులను గుర్తించి సభ్యులు పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, పి.భాస్కరరావు, వి.ఎస్.ఆర్.మూర్తి పాల్గొన్నారు.

హైస్కూల్‌కు కుర్చీల అందజేత



గాజువాక హైస్కూల్‌కు కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు కేఎన్నార్, గోపి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1990–91 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 50 కుర్చీలు అందజేశారు. ఆదివారం పూర్వ విద్యార్థులైన బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నర్సింగరావు, టీడీపీ నాయకుడు చట్టి గోపి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఆదివారం కుర్చీలను స్కూల్ హెచ్‌ఎం విజయ ప్రశాంతికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువులే దైవసమానులు అన్నారు. కార్యక్రమంలో దువ్వాడ ఏఎస్ఐ నర్సింగ్, డిజిటల్ ఎక్స్‌ప్రెస్ యజమాని బాలాకుమార్, ఎస్.పి.ఎల్.కృష్ణారెడ్డి, నూకరాజు, కృష్ణ, రామకృష్ణ, రామారావు, షకీలా, కృష్ణకుమారి, షైలజ, రజియా, బేగం, పల్లా వరలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యమైన పరిశోధనలతోనే విశ్వవిద్యాలయానికి గుర్తింపు



ఏయూ వీసీ రాజశేఖర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వర్సిటీ అలుమ్ని ప్రతినిధులు

విశాఖ విద్య: విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి ఎనలేని గుర్తింపును తీసుకొస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన పరిశోధకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నాణ్యమైన పరిశోధనలతో విశ్వవిద్యాలయానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తును, అవకాశాలను నిర్ణయించేది పరిశోధనలేనని, వాటి కోసం పూర్తి సమయాన్ని, మేధస్సును వినియోగించాలని సూచించారు.

ఏయూ వీసీకి అభినందనలు

వీసీ రాజశేఖర్‌ను పూర్వ విద్యార్థుల సంఘం అభినందించింది. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్ రాజా, జనరల్ సెక్రెటరీ ఆకుల చంద్రశేఖర్, ఈసీ మెంబర్ డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వీసీకి అభినందనలు తెలిపారు. గాయత్రీ విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు ఏయూ వీసీని కలిసి అభినందించారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల బృందం వీసీ రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పలువురు విశ్రాంత ఆచార్యులు ఆయనను అభినందించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



గుడివాడ లతీష్ చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న శంకర్, సుధాకర్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కుంచమాంబ, దుర్గమాంబ ఆలయాల నిర్మాణానికి దాతలు విరాళాల రూపంలో సహకరిస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామ నాయకుడు, స్వర్గీయ గొంతిన నూకరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు గొంతిన శంకర్, గొంతిన సుధాకర్‌లు ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ చేతుల మీదుగా రూ.2,22,022 ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

వేంకటేశ్వరునికి విశేష అలంకరణ



విశేష అలంకరణలో లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంతో వేంకటేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువ జాము నుంచే ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా విశేష పుష్పాలతో సహస్ర నామార్చన అనంతరం లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరుడిని విశేష పుష్పాలతో అలంకరణ చేపట్టారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇస్లాంపేటలో రంజాన్ సందడి



ఇఫ్తార్ విందులో ముస్లింలు

పెదగంట్యాడ: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభమైంది. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేటలో సందడి షురూ అయ్యింది. ఇక్కడి జామియా మసీదులో ముస్లింలు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇక్కడ మసీద్ పెద్దలు మస్తాన్, మసీద్ కమిటీ,మదర్సా కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా!



శిథిలమైన అడ్మిన్ భవనం సమీపంలో పడేసిన స్టీల్ సోఫా



నాలుగో ప్లాట్‌ఫారం వైపు వాహనాల పార్కింగ్ వద్దకు చేరిన బెంచీ

అగనంపూడి: పాలకులు, దాతల సహకారంతో దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు సేదతీరడానికి ఏర్పాటు చేసిన కుర్చీలు, స్టీల్ సోఫాలు వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, శిథిల భవనాల వద్ద, తుప్పల్లో కనపడుతున్నాయి. నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం వైపు ద్విచక్రవాహనాల పార్కింగ్ ప్రదేశంలో ఇనుప కుర్చీల సెట్‌ను పార్కింగ్ సిబ్బంది వాహనాలకు అడ్డంగా ఏర్పాటు చేయడానికి వినియోగించుకుంటున్నారు. అలాగే ఆర్‌పీఎఫ్ కార్యాలయం నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేయడంతో పాత భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఆ భవనం ముందు స్టీల్‌సోఫా, ముఖద్వారా వద్ద చెట్లు కింద స్టీల్ సోఫా సెట్లు దర్శనమిస్తున్నాయి. కొంతకాలంగా నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. దీంతో చాలా వరకు వాటిని తొలగించారు. తొలగించిన వాటిని మళ్లీ ప్లాట్‌ఫారాలపై ఏర్పాటు చేయడానికి భద్రపర్చకుండా తుప్పల్లో, పార్కింగ్ ప్రదేశాల్లో వదిలేయడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. అవన్నీ వినియోగానికి పనికి వచ్చేవి అయినా అధికారులు పట్టనట్టు వదిలేశారు. అధికారులు శ్రద్ధతీసుకొని బుకింగ్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలపై వీటిని ఏర్పాటు చేస్తే మంచిదని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి ముడసర్లోవ పార్కు సమీపంలో బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రాత్రి అటుగా ప్రయాణించే వాహనచోదకులు సమాచారం ఇవ్వడంతో అరిలోవ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బంధువులు ఎవరైనా ఉంటే అరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

సాధనతో సజావుగా జీవిత పయనం



ప్రవచిస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

మద్దిలపాలెం: మానవ జీవితం సజావుగా సాగేందుకు సాధన ఎంతో అవసరమని పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాధన రహస్యం అంశం మీద స్వామి వారి ప్రవచన కార్యక్రమం రెండో రోజు ఆదివారం ఆధ్యాత్మిక భావంతో సాగింది. స్వామీజీ మాట్లాడుతూ మనిషి జీవితం వివిధ తాపత్రయాలతో ముడిపడి ఉంటుందని, వాటికి తాత్కాలిక ఉపశమనం, శాశ్వత పరిష్కారం రెండు విధాలుగా లభిస్తుందని వివరించారు. ఉపశమనాల నుంచి పరిష్కారం దిశగా మారేందుకు ఆధ్యాత్మిక శక్తి మాత్రమే తోడ్పడగలదని చెప్పారు. వదలడం కాకుండా ఎదగడం వేదాంత ఉద్దేశమని అద్భుతంగా ఉదహరించారు. మహాత్ములందరూ ఈ బాటలోనే నడిచి, వారు తరించి, మనకు ఉద్బోధించారని తెలిపారు. వాహనాలు నడవడానికి ఇంధనం ఎంత అవసరమో.. జీవితం సజావుగా సాగేందుకు సాధన అంతే అవసరమని పేర్కొన్నారు. కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, డాక్టర్ చిట్టిపంతులు ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

57 మంది మందుబాబుల అరెస్ట్



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న గాజువాక సీఐ పార్థసారథి

అక్కిరెడ్డిపాలెం: బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని.. మద్యం సేవించి వాహనాలను డ్రైవింగ్ చేస్తున్న వారిపై గాజువాక పోలీసులు ఉక్కుపాదం మోపారు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి ఆధ్వర్యంలో ఆదివారం గాజువాక, బీసీ రోడ్డు, పెదగంట్యాడ, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైవ్ నిర్వహించారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారితో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి 57 మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వీరిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.